సాక్షి
వికారాబాద్
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



వేతనాలు విడుదల చేయాలి
కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ కోరారు. 10లో▸



వరద వస్తోందని ఆందోళన
వరద నీటి కారణంగా అవస్థలు పడుతున్నామంటూ సంగెంకలాన్ గ్రామ ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. 10లో▸



పరిహారం చెల్లించాలి
భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు కోరారు. 11లో▸

న్యూస్‌రీల్

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి
కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందు



జినుగుర్తిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

తాండూరు రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ ఇల్లు, సమాజం బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందు అన్నారు. సోమవారం మండలంలోని జినుగుర్తి గ్రామంలో పీహెచ్‌సీ వద్ద స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం డాక్టర్ రషీద్ మాట్లాడుతూ.. 200 మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంలింగారెడ్డి, అజ్మత్ అలీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి
అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



మాట్లాడుతున్న జయలక్ష్మి

కొడంగల్ రూరల్: అంగన్‌వాడీలు హక్కుల సాధన కోసం శాంతియుత ఉద్యమం చేస్తుంటే అక్రమ కేసులు పెట్టడం సరికాదని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రీ ప్రైమరీ విద్యను విరమించుకోవాలనే డిమాండ్‌తో సీఎం ఇంటి వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమపై కేసులు పెట్టారని, వెంటనే ఎత్తివేయాలన్నారు. ప్రభుత్వం ముందు ఉంచిన 18 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సత్వరం పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవా రం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం 43 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్డీఓ వాసుచంద్ర పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం
తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో సోమవారం జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సునీత ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ అంజయ్య, నారాయణరెడ్డి, నాయకులు గోపాల్, నారాయణరెడ్డి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, లొంక నర్సింలు, ఉప్పరి మల్లేశం, రియాజ్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

అస్తిత్వ పోరాటానికి సిద్ధం కావాలి

షాద్‌నగర్: అస్తిత్వ పోరాటానికి మాలలు సిద్ధం కావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాల పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేపట్టే ఎస్సీ ఉప వర్గీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, రోస్టర్ పాయింట్లను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం నవంబర్ 2న హైదరాబాద్‌లో భారీ ఎత్తున మాలల రణభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



భారీ బతుకమ్మ వద్ద మహిళల కోలాహలం



సింగర్ గీతామాధురి గానం




కడ్తాల్: బతుకమ్మతో యువతి

పూల పరిమళం.. రికార్డు సంబురం

రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం ‘మహా బతుకమ్మ’ వేడుకలు నిర్వహించారు. 1,500 మందితో తెలంగాణ బతుకమ్మ ఫోక్ డ్యాన్స్ అబ్బురపరిచింది. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ రెండు ప్రదర్శనలు అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించాయి. మరోవైపు జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఎటు చూసినా సందడి కనిపించింది.

– హుడాకాంప్లెక్స్

స్థానిక నగారా



జిల్లాలో రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎలక్షన్
- అమలులోకి వచ్చిన కోడ్
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

వికారాబాద్: ఎప్పుడెప్పుడా అని అంతా ఆశగా ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. ఇప్పటికే ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ జారీ చేసిన నేపథ్యంలో తాజాగా ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆశావహులు వ్యూహాలకు పదును పెడుతున్నారు. తొలి విడతలో పార్టీ గుర్తులపై నిర్వహించే జిల్లా, మండల ప్రాదేశిక స్థానాలకు ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత సర్పంచ్, వార్డులకు ఓటింగ్ జరుగనుంది. రెండు విడతల్లో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు, మూడు విడతల్లో జీపీల ఎన్నికలు నిర్వహించనున్నారు. సోమవారం నుంచే కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ముగిసిన నేపథ్యంలో పోలింగ్ బూత్‌లను సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

పరిషత్‌కు రెండు విడతల్లో..

జిల్లాలో 20 జెడ్పీటీసీ, 20 ఎంపీపీ, 227 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. తెలంగాణ వ్యాప్తంగా మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తుండగా, మన జిల్లాలో మాత్రం రెండు విడతల్లో పూర్తి చేయనున్నారు. తొలి విడతలో ఎన్నికలు నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు అక్టోబర్ తొమ్మిదిన నోటిఫికేషన్ జారీ చేసి, అదే రోజు నుంచి 11వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 12న నామినేషన్ల స్క్రూటినీ చేసి, అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడించనున్నారు. 13న అభ్యంతరాలను స్వీకరించి, 14న పరిష్కరించనున్నారు. 15న నామినేషన్ల ఉప సంహరణ సహా అదే రోజు అభ్యర్థుల జాబితాను ప్రకటించనుంది. 23న ఉదయం 7 నుంచి 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇక రెండో విడతలో ఎన్నికలు నిర్వహించనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు అక్టోబర్ 13న నోటిఫికేషన్ జారీ చేసి, అదే రోజు నుంచి 15 వరకు నామినేషన్లు స్వీకరించనుంది. 16న స్క్రూటినీ, అభ్యర్థుల జాబితాను ప్రకటించనుంది. ఆ తర్వాత 17న అభ్యంతరాల స్వీకరణ, 18న పరిష్కారం, 19న నామినేషన్ల తిరస్కరణ సహా అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనుంది. 27న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలు నిర్వహించనుంది. తొలి, విడత మలి విడత ఎన్నికల ఫలితాలను నవంబర్ 11న విడుదల చేయనుంది.

జీపీలకు మూడు విడతల్లో..

జిల్లాలో 594 గ్రామ పంచాయతీలు, 5,058 వార్డులు ఉన్నాయి. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు అక్టోబర్ 17న ప్రారంభమై 31వ తేదీతో ముగియనున్నాయి. రెండో విడత అక్టోబర్ 21న ప్రారంభమై నవంబర్ 4తో, మూడో విడత అక్టోబర్ 25న ప్రారంభమై నవంబర్ 8తో ముగుస్తాయి. అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలను వెల్లడించనున్నారు.

అమలులోకి ఎన్నికల నియమావళి

ఎన్నికల కోడ్ సోమవారం నుంచే అమలులోకి వచ్చింది. వరుస ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి పనులకు కోడ్ అడ్డంకిగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అత్యవసరాలు తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ తదితర పనులను మాత్రం అధికార యంత్రాగమే నిర్వహించనుంది. ప్రస్తుతం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయడానికి వీలులేదు. ఓటర్లను ప్రలోభపెట్టే పథకాలు, కార్యక్రమాలు నిర్వహించరాదు. నిధులు మంజూరైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు మరో నెలరోజులపాటు బ్రేక్ పడనుంది. ఇప్పటికే నిధులు మంజూరై కొనసాగుతున్న పనులకు మాత్రం ఎలాంటి ఆటంకం ఉండదు. సంక్షేమ పథకాల అమలులో కూడా కొత్త లబ్ధిదారుల ఎంపిక జరగదు. అదే విధంగా పాత లబ్ధిదారులకు మాత్రం యథాతథంగా ఫలాలు అందనున్నాయి.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

కోడ్ పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం నగరం నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ ప్రతీక్‌జైన్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు ఉంటాయన్నారు. కోడ్ అమలులోకి వచ్చినందున రాజకీయ ప్రచారాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు, గోడలపై రాతలు తొలగించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగీలాల్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాల మాఫీకి నిర్ణయం

- ఏకగ్రీవ తీర్మానం చేసిన నావంద్గీ సొసైటీ పాలకవర్గం
- పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం
- చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి

బషీరాబాద్: భారీ వర్షాలకు పూర్తిగా పంటలు కోల్పోయిన రైతులకు అండగా ఉంటామని నావంద్గీ సొసైటీ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశంలో నిర్వహించారు. కాగ్నా నది వరదల కారణంగా పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. బాధిత రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలని పాలకవర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. మండలంలో 1,117 మంది రైతులు సుమారు రూ.6.5 కోట్ల పంట రుణాలు తీసుకున్నారని వాటిని మాఫీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. మండలంలోని రైతులకు సేవాభావంతో యూరియా సరఫరా చేశామన్నారు. సొసైటీకి లాభం లేకున్నా యూరియా అందించామన్నారు. అందరి సహకారంతో సొసైటీ ఆర్థిక అభివృద్ధికి, అనేక వాణిజ్య వ్యాపారాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రంగారెడ్డి, తోట గోపాల్, హన్మంత్‌రెడ్డి, సీఈఓ వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కాలం చెల్లింది
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని, రాష్ట్రంలో రెండేళ్ల పాలన పూర్తికాక ముందే ఆ పార్టీ నిజస్వరూపాన్ని ప్రజలు గుర్తించారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం సోమవారం శేరిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబద్ధాల మాటలతో, మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు తప్పవని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.

సేంద్రియ సాగుపై ప్రచారం అవసరం
- రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్

తాండూరు రూరల్: వ్యవసాయ ఖర్చులు ఎలా తగ్గించుకోవచ్చో రైతులకు తెలియజేయాలని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్ సూచించారు. మండలంలోని జినుగుర్తి శివారులో గల ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ కళాశాలలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏడు రోజుల పాటు తెలుసుకున్న విషయాలను రైతులకు వివరించాలని సూచించారు. రసాయన ఎరువులు వాడకం వల్ల కలిగే అనర్థాలను, అలాగే సేంద్రియ సాగుతో కలిగే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వ్యవసాయ నమూనాలను తిలకించారు. కార్యక్రమంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగయ్య,కళాశాల ప్రిన్సిపాల్ పీవీరావు, తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సుధారాణి, రాజేంద్రనగర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజవర్ధన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ అలీబాబా, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన వ్యవసాయ నమూనాలను తిలకిస్తున్న శాస్త్రవేత్తలు, కళాశాల సిబ్బంది

శరవేగంగా దుద్యాల్ అభివృద్ధి

- రూ.300 కోట్లతో కొనసాగుతున్న పనులు
- రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, సమీకృత భవనాలు
- కొత్త మండలం కావడంతో భారీగా నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



హకీంపేటలో నిర్మాణ దశలో సమీకృత పాఠశాల భవనం

దుద్యాల్: మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొత్త మండలం కావడంతో సొంత భవనాల కొరత ఏర్పడింది. రెవెన్యూ సేవలు మినహా, ఇతర కార్యకలాపాలు పాత మండలాల్లోనే కొనసాగేవి. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో దుద్యాల్‌కు మహర్దశ పట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు మంజూరయ్యాయి. ఏకంగా రూ.300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, వ్యవసాయ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. వీటన్నింటినీ ఒకే చోటనిర్మిస్తున్నారు. రూ.100 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు జోరుగు సాగుతున్నాయి. దుద్యాల్‌లో రూ.8.5 కోట్లతో మండల సమీకృత భవన నిర్మాణాలు చేపట్టారు. పట్టణ పరిధిలోని మహబూబ్‌నగర్ – చించోళి జాతీయ రహదారి సమీపంలో రూ.3.5 కోట్లతో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం సాగుతోంది. అలాగే హకీంపేట్‌లో రూ.15 కోట్లతో సమీకృత పాఠశాల భవనం చేపట్టారు. మండల కేంద్రంలో రూ.45 కోట్లతో ఏటీసీ సెంటర్ నిర్మాణానికి ఇటీవల మంత్రి వివేక్ వెంకట్‌స్వామి భూమిపూజ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గౌరారంలో పల్లె దవాఖాన నిర్మాణ పనులు సాగుతున్నాయి. వీటితోపాటు అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. హకీంపేట్‌లో మహిళ శక్తి భవనం, ప్రభుత్వ పెట్రోల్ పంపు పనులు చేపట్టారు. దుద్యాల్ – లగచర్ల మధ్య ధాన్యం నిల్వ కోసం గోదాంలు నిర్మించనున్నారు. త్వరలో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి.

పారిశ్రామిక వాడ ఏర్పాటుతో..

మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియను దాదాపు పూర్తిచేశారు. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల పరిధిలో దాదాపు రూ.15 వేల కోట్ల వ్యయంతో పరిశ్రమలు నెలకొల్పనున్నట్లు అధికారి పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇది అందుబాటులోకి వస్తే వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి లభించే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కుల్కచర్ల ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు

కుల్కచర్ల: సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరమని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో పలు తండాల బాధితులకు మంజూరైన చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ.. అర్హులైన బాధితులు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, అంబు, రాజు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల కోసం ధర్నా



ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టిన వినియోగదారులు

కుల్కచర్ల: భారత్ గ్యాస్ సిలిండర్లు సమయానికి సరఫరా చేయడం లేదని వినియోగదారులు సోమవారం ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని వినియోగదారులు భారత్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సిలిండర్ల కోసం నిరీక్షించారు. ఏజెన్సీ నిర్వాహకులు స్పందించకపోవడంతో పరిగి–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న నిర్వాహకులు, పోలీసులు వారికి సర్దిచెప్పి సిలిండర్లను అందజేశారు. ముందస్తు బుకింగ్ లేకుండా కార్యాలయం వద్దకు రావడంతో సమస్య తలెత్తిందని నిర్వాహకులు చెబుతున్నారు. సిలిండర్ల కోసం ఒకరోజు ముందుగానే బుక్ చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

అంగన్‌వాడీ సిబ్బందికి చీరల పంపిణీ



అంగన్‌వాడీ సిబ్బంది, సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులతో జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత సన్నిధిలో సోమవారం అంగన్‌వాడీ సిబ్బందికి, ఆశ కార్యకర్తలకు మున్సిపల్ మాజీ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి చీరలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అమ్మవారి సన్నిధిలో ముత్తైదువులతో కుంకుమ, పసుపు(పసుపు బొట్టు) అందిస్తూ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు లక్ష్మీనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

బెన్నూరులో కూలిన ఇల్లు



కూలిన ఇంటిని చూపుతున్న అమృతమ్మ

యాలాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని బెన్నూరు గ్రామానికి చెందిన మాల అమృతమ్మకు చెందిన ఇల్లు కూలింది. పైకప్పు తోపాటు బయటి గోడలు బీటలు వారాయి. దీంతో అమృతమ్మ భయాందోళన వ్యక్తం చేసింది. తమకు ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది.



పరిగి: ఎమ్మెల్యే నివాసంలో బతుకమ్మ సంబరాలు



పరిగి: బతుకమ్మతో ఎమ్మెల్యే సతీమణి



తాండూరు: మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఊరూరా బతుకమ్మ సంబురం

రాష్ట్ర పండుగైనా బతుకమ్మను ఊరూరా వైభవోపేతంగా నిర్వహించారు. సోమవారం సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని మహిళామణులు సంప్రదాయ దుస్తులు ధరించి గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలు అలంకరించి కూడళ్లు, దేవాలయాల ప్రాంగణంలో ఆడి పాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



బషీరాబాద్: వేడుకల్లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి, మాజీ ఎంపీపీ కరుణ



వికారాబాద్‌లో బతుకమ్మతో మహిళ



కొడంగల్ రూరల్: బతుకమ్మతో మహిళలు



మోమిన్‌పేట: టేకులపల్లి శివాలయం ఆవరణలో..



మర్పల్లి: బూచన్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దోమ: బతుకమ్మ సంబురాలు



అనంతగిరి: కొత్తగడిలోని ఎస్సీకాలనీలో బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు



ధారూరు: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తాండూరుటౌన్: జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు స్వరూప



తాండూరు: మున్సిపల్ కార్యాలయంలో..



దుద్యాల్: పాటలు పాడుతున్న మహిళలు



యాలాల: బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు



నవాబుపేట: ఎక్‌మామిడిలో బతుకమ్మ ఉత్సవాలు



అనంతగిరి: శివరాంనగర్‌కాలనీలో..



అనంతగిరి: వికారాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

ఎస్ఐ వసంత్ జాదవ్



బొంపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వసంత్ జాదవ్

దోమ: శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపకరిస్తున్నాయని.. ప్రతీ గ్రామంలో తప్పక ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ వసంత్‌జాదవ్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని బొంపల్లిలో ఆయన సిబ్బందితో కలిసి సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో, దుకాణాలు, కాలనీలు, ఇళ్ల వద్ద తప్పక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, శేఖర్, రాములు, షేర్ ఖాన్, షఫీ, రమేష్, ఇంతియాజ్, మధు, బాబు, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బాస్పల్లి గ్రామ సమీపంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింలు పోలీసు సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు.

ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలి

మాజీ ఎమ్మెల్యే ఆనంద్



ఎన్నారంలో పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: పంట నష్ట పరిహారం ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో పర్యటించి భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి నష్టం అంచనాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందే వరకు అండగా నిలుస్తామన్నారు. వాగుల చుట్టూ ఉన్న పంట పొలాలన్ని పూర్తిగా నీట మునిగాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కోతకు గురియై పొలాలు సైతం కొట్టుకుపోయాయన్నారు. అలాగే దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. అనంతరం ఎన్నారంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. 22 నెలల పాలనలో కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు పంచారు. ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ నాయకులు ఓట్లకు వస్తే నిలదీయాలన్నారు. అనంతరం జిన్నారంలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సుందరి అనిల్, మల్లేశం, నాయకులు రాములు, వెంకటేష్‌యాదవ్, బల్వంత్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు వస్తుందని ఆందోళన

రైలు పట్టాలపై కూర్చున్న సంగెంకలాన్ గ్రామస్తులు



సంగెంకలాన్ గ్రామ శివారులో రైల్వేట్రాక్‌పై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: మండలంలోని సంగెంకలాన్ గ్రామ శివారులోని చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై తమకు నమ్మకం లేదని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామ సమీపంలోని బండలవాగు వద్ద రైల్వేట్రాక్ ఫిల్లర్లతో వరద నీరంతా ఎస్సీకాలనీలో వస్తోందని ఆందోళన చేపట్టారు. రెండోరోజు సోమవారం సైతం గ్రామ శివారులో ఉన్న రైల్వేట్రాక్ వద్ద గూడ్స్ రైలును అడ్డుకున్నారు. దాదాపు గంటపాటు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న చెట్టినాడు ప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. నష్టపోయిన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ తమకు నమ్మకం లేదని గ్రామస్తులు మండిపడ్డారు. ఆందోళన చేసిన తర్వాత పరిష్కారిస్తామని చెప్పి కనిపించకుండా పోతారని వాపోయారు. భారీ వర్షం కారణంగా ఎస్సీకాలనీలోని ఇళ్లల్లోకి మోకాళ్లలోతు వరద నీరు వచ్చిందన్నారు. నిత్యవసర సరుకులు పాడయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకి ఆందోళన విరమించకపోవడంతో కంపెనీ జీఎం శేఖర్ బాబు ఎస్సీకాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి నిత్యవసర సరుకులు, సామగ్రిని అందజేస్తామని హామీ ఇచ్చారు. గూడ్స్‌రైలును ఆపిన విషయం తెలుసుకున్న కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్, తాండూరు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ఆందోళనకారులకు సర్దిచెప్పారు.

గ్రూప్ -2 ఫలితాల్లో సత్తా



గణేశ్



సుష్మ

దోమ: గ్రూప్ -2 ఫలితాల్లో మండలం నుంచి ఇద్దరు అభ్యర్థులు సత్తాచాటారు. చట్లచందారం గ్రామానికి చెందిన వార్ల వెంకటయ్య కుమార్తె వార్ల సుష్మ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ)గా నియమితులయ్యారు. మల్లేపల్లి తండాకు చెందిన విస్లావత్ గణేశ్ ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించారు. వీరిని ఆయా గ్రామాల ప్రజలు అభినందించారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

కార్పెంటర్ దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: టిప్పర్ ఢీకొని కార్పెంటర్ మృతి చెందిన ఘటన పట్టణంలోని పాతజాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శరత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న శివశంకర్(33) ఈశ్వర్‌కాలనీలో కార్పెంటర్ షాపు నడుపుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి తన షాపు మూసి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో మహబూబ్‌నగర్ రోడ్డులోని యమ్మీ బేకరీ ఎదురుగా ఉన్న దుకాణానికి వెళ్లి రోడ్డుపైకి వస్తుండగా టిప్పర్ వెనుక నుంచి వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివశంకర్ తలకు తీవ్ర గాయాలై కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలను తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెచ్చిపోయిన చైన్ స్నాచర్

వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ఠాణా పరిధిలో సోమవారం ఓ చైన్ స్నాచర్ చేతివాటం ప్రదర్శించాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రాగన్నగూడ శోభానగర్‌లో నివాసం ఉండే దాశరథి చెన్నమ్మ(60) ఎన్టీఆర్ నగర్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంది. ఉదయం చెన్నమ్మ రాగన్నగూడ సబ్‌స్టేషన్ సమీపంలో కూరగాయలు పట్టుకుని నడుచుకుంటూ బస్టాండ్‌కు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వెనకాల నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల మంగళసూత్రం లాక్కుని పారిపోయాడు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్



కలెక్టరేట్ ఎదుట నాయకుల ఆందోళన

అనంతగిరి: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు పండుగ పూట కూడా పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కల్పించుకుని పెండింగ్‌లో ఉన్న వేతనాలు మంగళవారం వరకు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గోవర్ధన్, తుకారాం, మహేందర్, ఊషయ్య, శ్రీనివాస్, నర్సమ్మ, రవికుమార్, రామకృష్ణ, లక్ష్మయ్య, యాదయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ నియంత్రణతో గుండెపోటుకు చెక్

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జయప్రసాద్



ప్రపంచ హృదయ దినోత్సవ కార్యక్రమంలో డాక్టర్ జయప్రసాద్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

తాండూరు: రక్తపోటు నియంత్రణతోనే గుండెపోటు నివారించవచ్చని ఇండియన్ మెడికల్ అసోషియేషన్(ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జయప్రసాద్ అన్నారు. ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రన్ ఫర్ హెల్దీ హర్ట్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి సాయితరుణ్ ఆస్పత్రి వరకు నడిచారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హృద్రోగ సమస్యలు,. నివారణ చర్యలపై డాక్టర్ జయప్రసాద్ అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ బస్వరాజ్, కార్యదర్శి గౌరీశంకర్, మాజీ కౌన్సిలర్ సోమశేఖర్, నాయకులు తదితరులున్నారు.



అలుగుపారి.. వంతెన దెబ్బతిని

ధారూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారడంతో రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్యనున్న వంతెన పాక్షికంగా కొట్టుకుపోయింది. వరద ఉధృతి తగ్గడంతో దెబ్బతిన్న బ్రిడ్జి సోమవారం బయటపడింది. ఇరు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. 2016లో ఈ వంతెన వరదనీటి ప్రవాహానికి కొట్టుకపోగా రూ.50 లక్షలతో తాత్కాలికంగా నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం రాకపోకలు స్తంభించడంతో రెండువైపులా నుంచి రావడానికి 10 కిలోమీటర్లకు బదులుగా 60 కిలోమీటర్ల దూర భారం అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.